సాక్షి
మెదక్

శుక్రవారం । 9 । మే । 2025



మహిళా.. ఉపాధి భళా

'మంజీరా' బ్రాండ్ పేరుతో ఉత్పత్తులు తయారు చేస్తూ గ్రామీణ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. వివరాలు 10లో ▸



ప్రవేశాలకు వేళాయె..

2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వివరాలు 10లో ▸



బస్సు మళ్లీ తుస్సు!

ఖేడ్ ఆర్టీసీ డిపో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ రాహుల్‌రాజ్



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూ సమస్యలు ఉన్న రైతులకు భూ భారతి చట్టంతో మేలు జరుగుతుందని, సత్వరమే పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చిలప్‌చెడ్ మండలంలోని గంగారం, శేరి ఫైజాబాద్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. రైతుల భూసమస్యల గురించి అడిగి తెలుసుకొని, వారికి పలు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలున్న ప్రతి ఒక్కరూ రూపాయి ఖర్చు లేకుండా, ఉచితంగా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన ఆధారాలతో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సత్వరమే పరిష్కారమయ్యే సమస్యలు తహసీల్దార్ పరిధిలోనే, కీలకంగా ఉన్న సమస్యలు 80 శాతం వరకు ఆర్డీఓ స్థాయిలో పరిష్కారమవుతాయని తెలిపారు. మరీ కీలకంగా ఉంటే కలెక్టర్ స్థాయిలో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ధరణిలో పరిష్కారం కాని ప్రతి సమస్యకు భూ భారతిలో ఆప్షన్ ఉందన్నారు. మండలంలో ఈనెల 14 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. గురువారం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురుస్తున్నందున తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం బస్తాలు లోడ్ చేసిన అనంతరం విధిగా టార్పాలిన్ కప్పిన తర్వాతే పంపించాలని ఆదేశించారు. లారీలో రైస్ మిల్లులకు చేరిన ఆరు గంటల్లోపే అన్‌లోడ్ చేయించాలని, కేంద్రాల్లో సక్రమంగా రికార్డులు రాయాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రజనికుమారి, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బందికి అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష్యానికి మించి రుణాలు ఇప్పించినందుకు గాను మండలంలోని గూడూర్ గ్రామానికి చెందిన ఐకేపీ సిబ్బంది అవార్డు అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీఓ సుజాత, వీఏఓ చోటేబిలకు మంత్రి సీతక్క అవార్డు అందజేశారు. జిల్లాస్థాయిలో స్థానిక ఇండియన్ బ్యాంకు ద్వారా 210 శాతం మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించినందుకు గాను అవార్డు వరించినట్లు ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

తడిసిన ధాన్యం కొంటాం



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

చేగుంట(తూప్రాన్): ఈనెల 15లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని నిర్ణయించినందున రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. సహకార సంఘాల సీఈఓలు కొనుగోలు కేంద్రాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• కల్లాల్లో ధాన్యం.. కళ్లలో దైన్యం



ఆరుగాలం పడించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. మండల పరిధిలోని నత్తయ్యపల్లిలో కొన్ని రోజుల క్రితం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, కొనుగోళ్లు ప్రారంభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా రోజూ సాయంత్రం వర్షం పడదంతో ధాన్యం తడిసి ముద్దవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాకుండా పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

– నర్సాపూర్ రూరల్

• నీరంతా వృథా.. పట్టని వ్యథ



మండల కేంద్రమైన పాపన్నపేటలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మండల కార్యాలయం ఎదుట తాగు నీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు వరదలా పారుతోంది. దీంతో దిగువన ఉన్న ప్రజలు నీరందక అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం నార్సింగి శివారులో కూడా మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

– పాపన్నపేట(మెదక్)

ఎనిమిదేళ్లుగా తిరుగుతున్నా..



నేను అమెరికా వలస వెళ్లి తిరిగి వచ్చాను. ఇక్కడే సొంత ఇల్లు కట్టుకుందామని 2017లో మెదక్ పట్టణంలోని రెడ్‌రీచ్ మిషన్ కాంపౌండ్ ప్రాంతంలో కొంత స్థలం కొనుగోలు చేశా. అనుమతి కోసం మెదక్ మున్సిపాలిటీకి వెళ్లగా నాలా కన్వర్షన్ చేసుకొని రమ్మన్నారు. మున్సిపల్ అధికారులు అడిగిన అన్నిపత్రాలు ఇచ్చాను. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు తీసుకోవడం లేదు. గత 8 ఏళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా.. ఇప్పటికీ సమస్యకు పరిష్కారం చూపడం లేదు.

దోమ జితేందర్, మెదక్

రెండేళ్లుగా ఇదే గోస



మెదక్ మండలం రాయిన్‌పల్లి శివారులో 21 గుంటల పట్టా భూమి ఉంది. ఆ భూమిని మా నాన్న నుంచి నాకు వారసత్వంగా వచ్చింది. సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నాం. పాత పట్టాదార్ పాస్ పుస్తకంలో పట్టా అని ఉంది. 2018లో ఇచ్చిన కొత్త పాస్ పుస్తకంలో పట్టా భూమిని లావణి పట్టా అని పడింది. పాస్ పుస్తకాన్ని అప్పట్లో గమనించలేదు. రెండేళ్ల క్రితం అప్పుకోసం బ్యాంకుకు వెళ్లగా అక్కడ అధికారులు చెప్పారు. నాటి నుంచి ప్రతి ప్రజావాణిలో వినతులు అందజేస్తున్నా. ఇప్పటివరకు అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు.

గణపురం భిక్షపతి, మక్తభూపతిపూర్, మెదక్

నా భూమిని కబ్జా చేశారు



మా సొంత స్థలంలో ఇల్లు కట్టుకుందామంటే నా భర్త సోదరుడు ఆ భూమిని ఆక్రమించి కిరాణా షాపు ఏర్పాటుచేసుకున్నాడు. ఈ విషయమై ఎన్ని పంచాయితీలు పెట్టినా న్యాయం జరగడం లేదు. పైగా మా సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేయకుండా అడ్డుకుంటూ దాడికి పాల్పడుతున్నారు. దీంతో గత 2024 ఆగస్టు నుంచి కలెక్టర్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా, ఇప్పటి వరకు పరిష్కారం చూపడం లేదు. మనశ్శాంతి లేకుండా పోయింది.

రెనిలా, సోమక్కపేట, చిలప్‌చెడ్

ప్రజావాణిపై పట్టింపేది?

- అర్జీలు ఎక్కువ.. పరిష్కారం తక్కువ
- రెండేళ్లలో 19,667 వినతులు
- అధికారికంగా పెండింగ్‌లో 1,454
- కాలయాపనతో నెలల తరబడి ఫిర్యాదుదారుల నిరీక్షణ

సాక్షి ఫోకస్



ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు బారులు తీరిన ప్రజలు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి వినతులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తుంటే పదుల సంఖ్యలో మాత్రమే అధికారులు పరిష్కరిస్తున్నారు. దీంతో ఫిర్యాదుదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భూ సమస్యలే అత్యధికం

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. పహణీలో తప్పుందని, పొలం పాస్ పుస్తకంలో ఎక్కాల్సి ఉందని, పట్టాదార్ పాస్ పుస్తకం రావడం లేదని, ఆన్‌లైన్‌లో భూమి కనిపించడం లేదని అర్జీలు అందజేస్తున్నారు. వీటితో పాటు తమ ఇంటి స్థలం, పొలం ఆక్రమించారని, దాయాదులు భూమిని కబ్జా చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల కోసం వినతులు అందజేస్తున్నారు. అయితే ప్రజావాణి దరఖాస్తులు ఒక్కటి కూడా పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ పరిష్కారం కాక బాధితులు కలెక్టరేట్ చుట్టూ తిరిగి తిరిగి మనోవేదనకు గురవుతున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన రైతు

ఇటీవల మెదక్ మండలం శమ్నాపూర్‌కు చెందిన యువరైతు పట్నం సురేందర్ కలెక్టరేట్ భవనం ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎన్నిసార్లు ఫిర్యాదు ఇచ్చినా అధికారులు సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా భూ సమస్య పరిష్కరించక పోగా అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వాపోయాడు. కాగా అదనపు కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు. సంఘటన జరిగి నెలరోజులవుతున్నా.. ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

(అధికారంగా కేవలం 1,454 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతుండగా, భూముల సమస్యలు అత్యధికంగా ఉన్నట్లు సమాచారం)

ప్రజావాణి ఫిర్యాదులు ఇలా.. (అధికారికంగా రెండేళ్లలో)

కార్యాలయం	అర్జీలు	పరిష్కరించినవి	పెండింగ్
కలెక్టరేట్‌లో	3,801	3,426	375
ఆర్డీఓ	999	951	48
తహసీల్దార్	8,310	8,125	185
ఎంపీడీఓ	698	566	132
జిల్లా అధికారులకు	5,859	5,145	714

హడలెత్తిస్తున్న హైవే!

- ప్రమాదాలకు నిలయంగా 161 జాతీయ రహదారి
- కిలోమీటర్ వ్యవధిలోనే యాక్సిడెంట్లు



బొడ్మట్‌పల్లి వద్ద హైవేపై బోల్తాపడిన కారు (ఫైల్)

టేక్మాల్ (మెదక్): సంగారెడ్డి– నాందేడ్ అకోల ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లికి ఆనుకొని ఉన్న 161 హైవే కిలోమీటర్ పరిధిలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా హైవే అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రమాదాలు కోకొల్లలు

- ఈనెల 5వ తేదీన నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనం అధిక వేగంతో టైరు పగిలి బోల్తా పడింది. దీంతో కారు ధ్వంసం కావడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి.
- గతేడాది నవంబర్ 16వ తేదీన బొడ్మట్‌పల్లికి చెందిన ఓ మహిళ వ్యవసాయ పనులు ముగించుకొని రోడ్డు దాటుతుండగా అధిక వేగంతో వచ్చిన కారు ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.
- గతేడాది జులై 7వ తేదీన మండలంలోని కడిలా బాయితాండకు చెందిన మహిళా కూలీ పని ముగించుకొని రోడ్డు దాటుతుండగా వేగంతో వచ్చిన కారు ఢీకొని మృతి చెందింది.
- గతేడాది మే 5వ తేదీన సంగారెడ్డి నుంచి ఖేడ్ వైపు వెళుతున్న కారు బొడ్మట్‌పల్లి శివారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా తగలబడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తృటిలో ప్రమాదం తప్పింది.
- గతేడాది మే 4వ తేదీన చెందిన అనిల్ అనే వ్యక్తి హైదరాబాద్ వెళుతుండగా బొడ్మట్‌పల్లి వద్ద డివైడర్‌కు ఢీకొని కారు బోల్తా కొట్టింది. యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.
- 2023 అక్టోబర్ 15న హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళుతున్న టవేరా అధిక వేగంతో అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఇలా హైవేపై నిత్యం ఏదో ఒక రూపంలో ఇలాంటి సంఘటనలు కొకొల్లలుగా జరుగుతున్నాయి.

నివారణ చర్యలు శూన్యం

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా హైవే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి ఆనుకొని ఉన్న హైవే డివైడర్ మధ్యలో విద్యుత్ బల్బులు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. బొడ్మట్‌పల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, హైవేపై సూచిక బోర్డులు, విద్యుత్ బల్బులు, వేగ నియంత్రణ బోర్డులతో పాటు లైనింగ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరారు. పలుమార్లు వినతిపత్రం రూపంలో అందించారు. వినతులను పై అధికారులకు పంపిస్తున్నామని, నివారణ చర్యలు చేపడతామని చెబుతూ పనులు మాత్రం చేపట్టడం లేదు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

- 'సాక్షి' ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి నివాసంపై దాడిని ఖండించిన జర్నలిస్టులు
- ఉమ్మడి జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు



మెదక్‌లో కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



నర్సాపూర్: ఆర్డీఓ మహిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మెదక్‌జోన్: 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి నివాసంపై ఏపీ పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా పలు చోట్ల జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఏపీ పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో పలు యూనియన్‌ల నాయకులు, వివిధ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నీలం, నాగరాజు, భువన్, రాణి, సంగమేశ్వర్, కృష్ణమూర్తి నిరసన తెలిపి కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే నర్సాపూర్‌లో జర్నలిస్టు సంఘాల నాయకులు జి. భిక్షపతి, వెంకటేష్, సుధాకర్, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, శ్రీశైలం, బబ్బూరి సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్‌గౌడ్, వినోద్ నిరసన తెలిపి ఆర్డీఓ మహిపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాపన్నపేటలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మిన్‌పూర్ శ్రీనివాస్, పాపన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, మాజీ అధ్యక్షులు బాల్‌కిషన్, సత్యనారాయణ, శివచరణ్ సింగ్ తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎడిటర్ నివాసంలోకి చొరబడటం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఈ చర్యను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. శివ్వంపేటలో ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు బొడ్డు రవి ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి పోచగౌడ్, ఉపాధ్యక్షుడు నట్‌రాజ్‌గౌడ్, ముఖ్య సలహాదారుడు బాలేష్ తదితరులు నిరసన తెలిపి ఆర్ఐ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. కౌడిపల్లిలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు మల్లేశ్, కుమార్, రవిగౌడ్, సుభాష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శరత్, ప్రశాంత్, పెంటయ్య తదితరులు డిప్యూటీ తహసీల్దార్ జమీర్‌కు వినతిపత్రం అందజేశారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

- అధికారులకు ఎంపీ రఘునందన్ సూచన
- నిధుల ల్యాప్స్‌పై మండిపాటు
- సమాచారం లేకుండా మీటింగ్‌కు ఎలా వస్తారని నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన కలెక్టర్

మెదక్‌జోన్: అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆదేశించారు. గురువారం జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కనీస సమాచారం లేకుండా మీటింగ్‌కు ఎలా వస్తారని అధికారులను నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు జిల్లా ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత మీపై లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి క్లీనింగ్ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా జిల్లాకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మన ఊరు– మనబడి కింద చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు కాలేదని, చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సబ్ సెంటర్‌కు నిర్మాణాలకు సంబంధించి అదనపు నిధుల కోసం కేంద్ర ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్ కళాశాల మంజూరైనప్పటికీ నేటికీ భవన నిర్మాణం ప్రారంభం కాలేదని, సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో నియమించలేదని ప్రిన్సిపాల్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పీడీఎస్ బియ్యం అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హైవే ద్వారా చేపట్టిన మెదక్– సిద్దిపేట రోడ్డు, స్టేజ్ వన్ ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంలో నేషనల్ హైవే, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలన్నారు. మోడల్ సోలార్ గ్రామాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఓ పత్రిక ఐదు భారతీయ యుద్ధ విమానాలను పాకిస్తాన్ కూల్చి వేసిందని ప్రచారం చేయటంపై ఎంపీ మండిపడ్డారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పరిహారం

ఆర్డీఓ మహిపాల్



ఆర్డీఓకు అభిప్రాయాలు చెబుతున్న రైతులు

నర్సాపూర్: సంగారెడ్డి కాలువ రీచ్– 2 కోసం ప్రభుత్వం తీసుకుంటున్న భూములకు చట్ట పరిధిలో పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. గురువారం స్థానిక రైతు వేదికలో మండలంలోని లింగాపూర్ గ్రామ రైతులతో అవార్డు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నష్టం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. భూముల విస్తీర్ణం, ఆయా భూములలో చెట్లు, వ్యవసాయ బోర్లు ఇతర ఆస్తులు ఉంటే వాటి వివరాలు నమోదు చేయించి, వాటి విలువ మేరకు భూముల పరిహారంతో కలిపి అందజేస్తామని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమతో చెప్పాలని రైతులకు సూచించారు. భూమికి భూమి పరిహారం కింద ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. కాగా రైతుల అభిప్రాయాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్డీఓ చెప్పారు. శుక్రవారం శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఫైజల్, సాగునీటి పారుదల శాఖ(కెనాల్) డీఈ కవిత, ఏఈఈ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హల్దీ ప్రాజెక్ట్‌లో వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): చేపలు పట్టడానికి హల్దీ ప్రాజెక్ట్‌లోకి దిగిన యువకుడు నీటమునిగి గల్లంతయ్యాడు. ఈ విషాదకర ఘటన మాసాయిపేట మండలం హకింపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చెర్లపల్లి పంచాయతీ పరిధి వర్ధవాని చెరువుతండాకు చెందిన ఎలక్ట్రీషియన్ రాజు వద్ద అదే తండాకు చెందిన కేతావత్ గోపాల్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురు హకీంపేట శివారులోని హల్దీ ప్రాజెక్ట్‌లో చేపలు పట్టడానికి గురువారం ఉదయం వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో గోపాల్ ప్రమాదశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న రాజు విషయాన్ని కుటుంబసభ్యులు, పోలీసులకు చేరవేశాడు. దీంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది సహకారంతో ప్రాజెక్ట్‌లో సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా గోపాల్ గల్లంతుపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటి ఆరుబయట కూర్చున్న వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అందుగులపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దున్న శేఖాగౌడ్(61) బుధవారం ఉదయం ఇంటి వరండాలో కూర్చొని ఉండగా ఒక్కసారిగా కుప్పకూలి స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబసభ్యులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నర్సాపూర్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 6న గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోయి ఉన్నట్లు ఆర్టీసీ కంట్రోలర్ సాన సత్యనారాయణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అదే రోజు ఆ వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి కుడి చేతిపై పచ్చబొట్టు, ఒంటిపై స్కై బ్లూ వైట్ కలర్ చొక్కా, ఆలివ్ కలర్ పాయింట్ ఉంది.

మద్యానికి బానిసై కిందపడి..

జహీరాబాద్ టౌన్: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యుత్ కాలనీకి చెందిన ప్రకాష్ (35) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న తాగిన మత్తులో అదుపుతప్పి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బావిలో పడిన వ్యక్తి సురక్షితం

కాపాడిన ఫైర్ సిబ్బంది



బుచ్చయ్యను బావిలోంచి తీసున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్ ఎదుట ఉన్న బావిలో గురువారం జక్కనపల్లి బుచ్చయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. స్థానికులు వెంటనే ఈ విషయాన్ని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది బావిలోకి నిచ్చెన వేసి బుచ్చయ్యను కాపాడారు. కాపాడిన వారిలో సిబ్బంది రాంచందర్, నరసింహ, శ్రీనివాస్, ఎల్.శ్రీనివాస్ ఉన్నారు.

మహిళా.. ఉపాధి భళా

- సర్వోదయ మహిళా పారిశ్రామిక సంస్థ స్థాపన
- ఐఆర్ఎస్ అధికారుల ప్రోత్సాహం
- మొత్తం రూ.4 కోట్ల పెట్టుబడి..
- మంజీరా బ్రాండ్ పేరుతో సహజ ఉత్పత్తులు
- హైదరాబాద్ ఐఐటీతో అనుసంధానం

సాధికారత సాధించిన గొంగ్లూరు నారీమణులు

వారు ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు... ఇంటి, వ్యవసాయ పనులు తప్ప ఏ పనులు చేసేవారు కాదు. ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐఆర్ఎస్ అధికారుల సహకారంతో వారు ఇప్పుడు గ్రామీణ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. గ్రామంలోనే సర్వోదయ మహిళా పారిశ్రామిక సంస్థను నెలకొల్పి 'మంజీరా'బ్రాండ్ పేరుతో ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను ఔట్‌లెట్‌లను పెట్టి విక్రయిస్తున్నారు. హైదరాబాద్ ఐఐటీ సహకారంతో విదేశాలకు పంపడానికి కృషి చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం గొంగ్లూర్‌లో సర్వోదయ మహిళా పారిశ్రామిక వేత్తల విజయమిది. –పుల్‌కల్(అందోల్)

గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐఆర్ఎస్ అధికారులు అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా మహిళలకు ఉపాధి చూపించాలని తలంచి 'సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్'అనే సంస్థను 2022 జనవరిలో నెలకొల్పారు. గ్రామంలోని మహిళల నుంచి రూ.50 వేల నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడులు పెట్టించారు. గ్రామ మహిళలే కాకుండా డాక్టర్లు, ఐఆర్ఎస్ అధికారులతో కలిపి రూ.4 కోట్లు జమ చేశారు. ఈ పెట్టుబడితో ప్రారంభించిన వీరి వ్యాపారం ఇప్పటి వరకు రూ.2 కోట్ల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించారు. కంపెనీలు, చట్టం నిబంధనలకు అనుగుణంగా భారతీయ ఫుడ్ సేఫ్టీ సంస్థతో, గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ, నూనె ఉత్పత్తులకు సంబంధించి భారతీయ ఆయూష్ సంస్థలతో అనుమతులు తీసుకున్నారు.

అన్నీ సహజ ఉత్పత్తులే...

సర్వోదయ ఉత్పత్తులన్నీ కల్తీ లేకుండా సహజంగా లభించే ముడి పదార్థాల ద్వారా తయారు చేస్తున్నారు. వీరు అన్ని రకాల గానుగ నూనెలు, సంప్రదాయంగా తయారు చేసిన పప్పులు, చిరుధాన్యాలు, కారంపొడులు, చేతితో తయారు చేసిన సబ్బులు, సర్ఫ్, హౌస్‌కీపింగ్ మెటీరియల్, ఇలా రకరకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.



మంజీరా' ఔట్‌లెట్

ఔట్‌లెట్‌ల ఏర్పాటు

మంజీరా బ్రాండ్ పేరుతో సర్వోదయ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను హైదరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్‌లో ఔట్‌లెట్‌లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఔట్‌లెట్‌లలో ఈ బ్రాండ్ ఉత్పత్తులన్నీ లభిస్తాయి.

ఐఐటీతో అనుసంధానం..

గొంగ్లూరులో సర్వోదయ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను హైదరాబాద్ ఐఐటీ వారి సహకారంతో జపాన్‌కు ఎగుమతి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. జపాన్ నుంచి ప్రతినిధులు సైతం ఇక్కడికి వచ్చి ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్మడానికి హైదరాబాద్ ఐఐటీ సాంకేతిక సహకారం అందిస్తోంది.



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు

గ్రామంలోనే ఉపాధి



ఐఆర్ఎస్ అధికారులు మా గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. సర్వోదయ మహిళా సంస్థను నెలకొల్పి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ కంపెనీలో పని చేసే అందరూ పెట్టుబడి పెట్టి ఉపాధి పొందుతున్నారు.
–సంతోషిమాత, సర్వోదయ మహిళ

సాధికారత సాధించాం



సర్వోదయ సంస్థలో పని చేస్తున్న మహిళలు పెట్టుబడులు పెట్టి యాజమాన్య హక్కులు కలిగి ఉన్నారు. పెట్టుబడి పెట్టిన వారికే ఈ కంపెనీలో ఉపాధి లభిస్తుంది. అన్ని రకాల ఉత్పత్తులపై అనుభవం సంపాదించాం.
–ఎస్.సునీత, సర్వోదయ మహిళ



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ఏఐతో పంట తెగుళ్ల గుర్తింపు

ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్

ములుగు(గజ్వేల్): కృత్రిమ మేథ(ఏఐ), రోబోటిక్స్, డ్రోన్‌ల ఏకీకరణ ద్వారా పంట దిగుబడి, తెగుళ్ల, వ్యాధుల అంచనా వేయవచ్చని ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. ఈ మేరకు ములుగు ఉద్యాన వర్సిటీలో గురువారం హైదరాబాద్‌కు చెందిన మారుత్ డ్రోన్స్ సంస్థతో ఉద్యాన పంటలపై పరిశోధన, అభివృద్ధి, శిక్షణలో సహకారం పెంపొందించడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన వన ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుతున్నదని తెలిపారు. డ్రోన్ ఆధారిత సాంకేతికత సామర్థ్యాన్ని ఉపయోగించి పంట పర్యవేక్షణ, తెగులు, వ్యాధుల అంచనా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను మెరుగు పరచడం లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ఆరు ప్రధాన ఉద్యాన పంటలు మిర్చి , పసుపు, టమోటా, వంకాయ, ఆయిల్‌పామ్, మామిడి పరిశోధన శిక్షణ కార్యక్రమాలు సాంకేతిక అభివృద్ధిపై సంయుక్తంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో మారుత్ డ్రోన్ కో ఫౌండర్ ప్రేమ్ కుమార్, ఉద్యానవర్సిటీ అధికారులు భగవాన్, చీనా నాయక్, లక్ష్మీనారాయణ, సురేశ్‌కుమార్, శ్రీనివాసన్, వీణాజ్యోతి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- లిఫ్ట్ అడిగి వెనుక కూర్చున్న వ్యక్తి మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు



బిక్యానాయక్ మృతదేహం

నారాయణఖేడ్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మరణించగా ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన నారాయణఖేడ్ మండలం నాగాపూర్ గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన సురేష్ ఖేడ్ మండలం అబ్బెంద క్లస్టర్ ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్నాడు. నాగాపూర్ గ్రామంలో తన విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై నాగాపూర్ తండాకు చెందిన బిక్యానాయక్‌తో కలిసి ఖేడ్‌కు వస్తున్నాడు. కంగ్టి వైపు నుంచి ఖేడ్ మండలం సీతారాం తండాకు చెందిన కాశీరాం తన కుమారుడైన చందుతో కలిసి ద్విచక్రవాహనంపై ఖేడ్ వైపు వస్తున్నారు. నాగాపూర్ దాటాక సురేష్ ద్విచక్రవాహనాన్ని కాశీరాం వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లగా బిక్యానాయక్(65) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ సురేష్(35), కాశీరాం(35), చందు (5)లను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో ధ్వంసమైన వాహనాలు

లిఫ్ట్ అడిగి ప్రాణాలు కోల్పోయి..

నాగాపూర్ నుంచి ద్విచక్రవాహనంపై ఖేడ్‌కు వస్తున్న ఏఈఓ సురేష్‌ను బిక్యానాయక్ లిఫ్ట్ అడిగి అతడి వాహనంపై వెనుకకూర్చుని వస్తున్నాడు. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. బిక్యానాయక్‌కు భార్య అనిశాబాయితోపాటు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు సంతానం. కాగా కూతుళ్ల వివాహాలు జరిగాయి. అతడి మృతితో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో అప్పుల బాధతో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

సిద్దిపేటకమాన్: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన పెద్దెల్లి తానేష్ (40) జీవనోపాధి నిమిత్తం సిద్దిపేటకు వచ్చి హనుమాన్‌నగర్‌లో అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. తానేష్‌కు ఎటువంటి ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై కుటుంబ పోషణ భారమైంది. అప్పులు చేసి తీర్చే మార్గం లేక గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి..

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో సతమతమై మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ రాజు కథనం ప్రకారం... మండల పరిధిలోని పల్ల సావిత్రి, యాదగిరి ప్రథమ కుమారుడు మనోహర్(23) కిరాణం కొట్టుపెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. దీంతో కుటుంబ పోషణతో పాటు వ్యాపారంలో నష్టాలు రావడం వల్ల అప్పులు పేరుకుపోయాయి. దీంతో ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన తమ్ముడు దుర్గాప్రసాద్‌కు తెలుపగా వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి గాంధీ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మనోహర్(ఫైల్)

పెళ్లింట తీవ్ర విషాదం

విద్యుదాఘాతంతో మహిళ మృతి

జహీరాబాద్ టౌన్: పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. విద్యుదాఘాతానికి గురై పెళ్లి కొడుకు మేనకోడలు మృతి చెందింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం ఖలీల్‌పూర్‌లో గురువారం చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... ఖలీల్‌పూర్ గ్రామానికి చెందిన బ్యాగరి పూర్ణచందర్ పెళ్లి శుక్రవారం జరగనుంది. నీళ్ల తేవడానికి బోర్ మోటర్‌ను ఆన్ చేయడంతో ఆ ప్రాంతం తడిగా మారింది. ప్రక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు తీగకు కరెంట్ సరఫరా అవుతుండగా అక్కడి వరకు నీళ్లు వెళ్లాయి. పెళ్లి కొడుకు అక్క కూతురు భాగ్యలక్ష్మి(32) సపోర్టు తీగ పక్క నుంచి వెళ్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. భాగ్యలక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసముండే గడియారం బాలమణి(65)కి ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. అందరి వివాహాలు జరగడంతో ఆమె వేరుగా ఉంటుంది. ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆమె మృతికి గల వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



ప్రిన్సిపాల్ రాజన్న

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ బాణోతు రాజన్న నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో చేరాలని సూచించారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ ఈటీ (ఎలక్ట్రికల్ టెక్నీషియన్)తో పాటు ఈ యేడాది నూతనంగా ఎంఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియంతో పాటు ఒకేషనల్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(పారా మెడికల్ కోర్స్)లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధురాలు అదృశ్యం



లక్ష్మమ్మ

మెదక్ మున్సిపాలిటీ: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మెదక్ పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. పట్టణంలోని జంబికుంట వీధికి చెందిన తొనిగండ్ల లక్ష్మమ్మ(68)మతిస్థిమితం సరిగా లేదు. ఆమె ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 57913, 87126 57878 కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

గజ్వేల్‌లో యువతి..

గజ్వేల్‌రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన పంచాల మాధవి గురువారం ఉదయం ఇంట్లో నుంచి షాపు వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు జరగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో భరోసా కేంద్రం ఆధ్వర్యంలో పోక్సో, లైంగిక దాడుల కేసులపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు జరిగే లైంగిక దాడులను పోక్సో కేసులుగా పరిగణిస్తారని తెలిపారు. గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి కేసులపై అవగాహన కల్పించి, నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె

తూప్రాన్: కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్‌ల రద్దును కోరుతూ మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.మల్లేష్ పిలుపునిచ్చారు. గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనం కోసం పనిచేస్తుందని ఆరోపించారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.. 8గంటల పని సమయాన్ని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలమణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.మహేందర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి గౌరి, కమిటీ సభ్యులు లహరి, సీఐటీయూ నాయకులు ప్రవీణ్, యాదమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంపై ఎస్పీకి ఎంపీ ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: భారతదేశం పాకిస్తాన్‌పై జరుపుతున్న యుద్ధం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన ఎంపీ ఓ దినపత్రికలో.. భారతదేశం ఐదు యుద్ధ వైమానిక విమానాలను పాకిస్తాన్ ఆర్మీ కూల్చి వేసిందని తప్పుడు కథనాలు రాశారని వారిపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా నాయకులు సుభాష్ గౌడ్, బీజేపీ నాయకులు ప్రసాద్, సతీష్, శివ, రమేష్ గౌడ్, అంజి, నాగరాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన మృతదేహం లభ్యం

సిద్దిపేటకమాన్: రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం... చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన కూన కిషన్ (36) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా రెండు రోజులుగా విపరీతంగా తాగుతూ డబ్బుల కోసం భార్యతో గొడవ పెట్టుకొని గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం సమయంలో పట్టణ శివారులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రవేశాలకు వేళాయె..

కేజీబీవీల్లో ప్రవేశాలు షురూ

- ఆంగ్ల మాధ్యమంలో బోధన
- ఆరో తరగతి అడ్మిషన్లు ప్రారంభం
- జిల్లాలో 22 పాఠశాలలు

దుబ్బాకటౌన్: పేద, వెనుకబడిన, మధ్యలో బడి మానేసిన బాలికలకు విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలను (కేజీబీవీ) ఏర్పాటు చేసింది. తల్లిదండ్రులు లేని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులకు ఉన్నత చదువులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో వీటిని ప్రారంభించింది. విద్యార్థులలో నైపుణ్యాలను మెరుగుపరిచి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏప్రిల్ 24 నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాలకు మొదట తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తర్వాత మిగిలిన విద్యార్థినులకు ప్రవేశాల కోసం నమోదు చేసుకుంటున్నారు. ప్రవేశాలకు విద్యార్థులు 5వ తరగతి వరకు చదువుకున్న బోనోఫైడ్, టీసీ, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటోలు జత చేయాలి.

ఆరో తరగతిలో..

జిల్లాలో మొత్తం 22 కేజీబీవీలు ఉన్నాయి. ప్రతి తరగతిలో 40 మంది చొప్పున విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే ఆరో తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 7వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఏమైనా ఖాళీలు ఉంటే ప్రవేశాలు కల్పిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు తీసుకుంటున్నారు.



ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ఆంగ్ల మాధ్యమంలో బోధన

విద్యార్థినులకు అన్ని రకాల వసతులు, మెనూ ప్రకారం ఆహారం, నాణ్యమైన విద్య, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు వసతితో కూడిన విద్య అందిస్తుండటంతో ఈ పాఠశాలలు నిరుపేద కుటుంబాల బాలికలకు ఎంతో ఆసరగా నిలుస్తున్నాయి. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులతోపాటు నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తున్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పొందేలా కుట్లు, అల్లికలతో పాటు ఇతర అంశాలను నేర్పిస్తున్నారు. వివిధ రకాల వృత్తి విద్య కోర్సులు సైతం అమలు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



నాణ్యతతో కూడిన విద్య, వసతి గృహం అందుబాటులో ఉన్నందున గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్‌లో విద్యార్థినులకు ఉపాధి కల్పించేలా వృత్తి విద్య కోర్సులు, కుట్లు ,అల్లికలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ వారికి భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.
– స్వాతి, దుబ్బాక కేజీబీవీ పాఠశాల, ప్రత్యేక అధికారి